

# విద్వేష

విజయలక్ష్మి మురళీధర్

ఒక పేషంటుని చూశాక ఇంకొక పేషంటు లోపలికి రావడం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు సైకియాట్రిస్ట్ అయినటువంటి డా. రఘురాం.

ఆయన కన్‌సల్టింగ్ రూమ్‌లోకి ఎవరు వచ్చినా సరే వారి మనసులు ఎక్కడలేని ప్రశాంతతనీ పొందుతాయి.

అది ఆయన చూసే చల్లటి చూపు మూలాన కావచ్చు, లేదా ఆ రూముని ఎరేంజ్ చేసుకున్న తీరుకావచ్చు.

తన పరిసరాలనే అంత అందంగా పద్ధతిగా, నీట్‌గా పెట్టుకుని నీట్‌గా వుండే ఆ డాక్టరుని చూడగానే తమ

రోగం సగం తగ్గినట్లు ఫీలవుతారు పేషంట్లు.

అలికిడికి తలెత్తి చూశాడాయన.

ఆ వచ్చినవారు నిర్లిప్తత తప్పితే ఇంకేం భావం చూపించటం లేదు.

అయినా ఒక డాక్టరు దగ్గరకి వచ్చే రోగులు నిర్లిప్తతతో, బాధలతో కాకపోతే ఉల్లాసంగా వస్తారా?

అయినా సైకియాట్రిస్ట్ అయినటువంటి రఘురాం దగ్గరకి బాధలతోనే కాదు, ఆందోళనతో, ఆరాటంతో, ఒక్కోసారి మరీ మెంటల్‌గా అప్‌సెట్ అయిన కేసులని ఆయాసంతోనూ లాక్కొని వస్తారు.

ప్రస్తుతం అక్కడ నిల్చున్న వారిని చూస్తే, ఆ పద్దెనిమిదేళ్ళు వుండే అబ్బాయి పేషంటులా ఉన్నాడు. అతని తల్లి అనుకుంటా అతన్ని పొదివి పట్టుకుంది. ఆ ఆసరాతో మాత్రమే ఇంకా అతను నిల్చోగలిగినట్లున్నాడు. ఆమె చేయి సడలిస్తే కిందపడి పోయేటట్లున్నాడు.

అతని తండ్రి కాబోలు, లోకంలోని దైన్యాన్నంతా కళ్ళలో మూటగట్టుకున్నాడా అన్నట్లున్నాడు.

చూడగానే తెలుస్తోంది మధ్యతరగతికి చెందిన వారని.

చూడగానే అనిపించింది బాగా చదువుకున్నవారని.

చూడగానే గ్రహించాడాయన ఎవరో సంస్కారవంతులని.

"ప్లీజ్. సిట్ డౌన్." అన్నాడు రఘురాం.

ఏమీ మాట్లాడకుంటానే కూర్చున్నాడాయన.

ఆవిడకూడా కొడుకుని పక్కనే కూర్చోబెట్టి తనూ కూర్చుంది.

"మా అబ్బాయి శ్యామసుందర్. గత వారం రోజులుగా నార్మల్‌గా లేడు." అంటూ చెప్పకురాసాగాడు అతనిలో కలిగిన మార్పులన్నిటినీ ఆ తండ్రి.

గత కొద్ది నెలలుగా చాలా మౌనంగా ఉంటున్నాడనీ, వారం నించీ మటుకూ పిచ్చి చూపులు చూడటం, రాత్రుళ్ళు కుళ్ళి కుళ్ళి ఏడవడం వంటివి చేయడం, ఏం మాట్లాడించినా, ఏ ప్రశ్న వేసినా భోరున ఏడవడం గురించి విపులంగా చెప్పాడాయన.

ఆ అబ్బాయివైపు చూసాడాయన. చక్కటి కుర్రాడు. ఎంతో ఉజ్వల భవిష్యత్తుకల ఆ కుర్రాడు అలా బేలగా, పిచ్చి చూపుల్తో తల్లి గుండెల్లో ఒదిగిపోతుంటే కడుపు తరుక్కుపోయింది రఘురాంకి.

ఎందుకు?

బహుశ ఆయనికి కూడా అదే వయసుగల కొడుకు ఉండటం మూలానేమో!

శ్యామూని పరీక్ష చేశాక ఎడ్మిట్ చేసుకుంటామని చెప్పాడు.

ఆమె కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

అవును జబ్బు ఏదయినా ఎలాటిదైనా కన్న కొడుకుని పిచ్చాసుపత్రికి అప్పగించడం అంటే మాటలా.

తమ కొడుకుకి పిచ్చి పట్టిందీ అన్న ఆలోచనే గగుర్పాటుని కలిగిస్తుంది ఏ తల్లిదండ్రులకైనా!

ఆ తండ్రి నోట మాట రాలేదు.

మాట్లాడటానికి ఏముంటుంది.

"సర్" ఆయన ఓ నోటు బుక్కుని రఘురాం ముందుకి తోశాడు.

ఆశ్చర్యంగా అందుకున్నాడు దాన్ని రఘురాం.

"మా అబ్బాయి డైరీ. నాకూ తెలియదు వాడికీ అలవాటుందని. మీకు సహాయ పడుతుందనుకుంటాను.

దాన్ని బ్రీఫ్‌కేసులో పెట్టుకున్నాడు.

** ** **

ఆ రాత్రి రఘురాంకి ఎందుకో నిద్రపట్టలేదు. నిద్రపోదామని కళ్ళు మూస్తోంటే, పొద్దున్న చేర్చుకున్న ఆ శ్యామ్‌సుందర్ అనే కుర్రాడి ముఖమే గుర్తుకి వస్తోంది.

అప్పుడు వున్నట్టుండి గుర్తుకొచ్చింది ఆ అబ్బాయి రాసుకున్న డైరీ తన దగ్గరే ఉందని.

లేచి ఆ పుస్తకాన్ని చదవడం మొదలెట్టాడు.

తను ప్రతీరోజూ చేసుకున్న దైనందిన కార్యక్రమాల నుండి, జరిగిన సంఘటనలనీ తనకు తోచినట్లుగా వ్రాసుకుంటూ పోయినట్లుంది.

కానీ, అక్కడక్కడా కొన్ని పేజీలను గుర్తుపెట్టుకొని డాక్టరుగా రఘురాంని మళ్ళీ చదివింప చేశాయి కొన్ని పేజీలు... వాటిలో...

...ఈ రోజెందుకో దిగులుగా వుంది. నాన్న ఎందుకో సుఖపడుతున్నట్టే అనిపించడు. చిన్నప్పటి నుంచీ చూస్తూనే ఉన్నాను. ఆయన చిన్న ఉద్యోగం చేస్తున్నా పిల్లలకి ఏ లోటూ రానివ్వలేదు. తమకి తిండి లేకపోయినా పిల్లలకి ఆకలంటే ఏమిటో తెలియకుండా పెంచుతున్నారు. చదువు సంధ్యలు కూడా నేర్పిస్తున్నారు....

...చదువుకోరా వెధవా అంటూ పరీక్ష పాస్ అవకపోతే



తంతాను, అంటూ అప్పుడప్పుడూ చదువుకోకపోతే బెల్టుతో కూడా దెబ్బలు కొట్టే పక్కింటి పవన్ వాళ్ల తల్లిదండ్రుల్ని చూస్తే భయం నాకు. ఈ రోజు కూడా వాడు దెబ్బలు తిన్నాడు.

ఎందుకు శ్రద్ధగా చదువుకోడసలు!

అసలే జులాయిగా తిరిగే పవన్ అత్తెసరు మార్కులతోనే పాసవుతాడు ఎప్పుడూ.

ఏనాడూ అమ్మా నాన్నా చదువుకో అని నాతో గట్టిగా చెప్పగా గుర్తులేదు. కళ్లెర్రచేసిన గుర్తులేదు. అందుకేనేమో పవన్ వాళ్ళ తల్లితండ్రుల ముందు దేవతల్లాగా అనిపిస్తారు. అందుకేనేమో వారు చెప్పకుండానే నేను బుద్ధిగా చదువుకుంటాను.

నేను ప్రతీసారి క్లాసులో ఫస్టు మార్కు తెచ్చుకుని అమ్మా నాన్నలకి నా రిపోర్టు చూపించినప్పుడు వారి కళ్ళలో వెలిగే వెలుగు నాకు ప్రోత్సాహాన్ని ఇచ్చేది. ఇప్పుడూ ఇస్తుంది. నేనలా రిపోర్టు తెచ్చినపుడల్లా పరమాన్నం చేసేది అమ్మ అంతకంటే ఎక్కువ చేసే స్తోమతు లేదుగనుక. వయసు పెరుగుతున్నకొద్దీ నేను చదువుకుని ఎంతో వృద్ధిలోకి వస్తే వారికంత సంతోషం కలిగిస్తుందని గ్రహించిన నేను ఏనాడూ చదువుని అశ్రద్ధ చేయలేదు...

డా. రఘురాంకి ఆ పంక్తులు ఎందుకో కన్నీళ్ల తెప్పించాయి.

...ఈ రోజెందుకో నాన్నగారు చాలా సీరియస్‌గా ఆఫీసునుంచి వచ్చారు. ఆయన మూడ్ అంతబాగా లేదు.

'నా కొడుకు నాలాగా కష్టాలు పడడే, పెద్ద చదువులు చదువుకొని, పెద్ద ఉద్యోగాలు చేసి నిన్నూ నన్నూ సుఖపెడతాడు' అమ్మతో అన్నారు. ఎందుకో ఆయన కంఠం వణికింది. ఆయన కళ్ళలో చిప్పిల్లిన నీళ్ళు నా దృష్టిని తప్పించుకోలేకపోయాయి. నాకూ ఆయన బాధని పంచుకోవాలనిపించింది. ఈ వయసులో కల వ్యత్యాసమే కదా దానికి అడ్డువస్తోంది....

...నిన్న నాన్నగారు అంత బాధపడటానికి కారణం తెలిసింది. ఆయన కన్యాయం చేసి ఆఫీసులో ఇంకెవరికో ప్రమోషన్ ఇచ్చారని. అంతకంటే ఎక్కువ వివరాలని అర్థం చేసుకునే వయసు కాదు నాది. అందుకే అంతకంటే ఎక్కువ ఆలోచించాలని లేదు....

...నా కెందుకో జ్ఞానం తెలిసినప్పటినుంచీ కూడా డాక్టరునవ్వాలని కోరిక. ఒక తాడుకి అగ్గిపెట్టెని కట్టి, స్టెత్‌లాగా పట్టుకుని, నేను డాక్టరుని... నేను డాక్టరుని అంటూ అందరి గుండెలమీద పెట్టి పరీక్ష చేసేవాడిని. తమ్ముడే నాకు పేషంటు. వాడిని పడుకోబెట్టి తెగ పరీక్షలు చేసేస్తూ వుండేవాడిని. నా చిలిపి చేష్టలకి అమ్మ ముచ్చటపడి తెగ నవ్వుతూ ఉండేది.

నాలో ఏర్పడిన ఈ భావం బలపడేందుకు దోహదం చేసింది ఈ రోజు జరిగిన సంఘటన.

అమ్మమ్మ చనిపోయిందని తెలిసి వూరెళ్ళి ఈ రోజే తిరిగి వచ్చింది అమ్మ. సరైన వైద్య సదుపాయం సమయానికి అందక మాత్రమే పోయిందన్న సంగతి తెలిసిన మేమందరమూ కూడా చాలా బాధపడ్డాం. అమ్మ — కన్నతల్లిని పోగొట్టుకున్న అమ్మ నన్ను తన గుండెల కదుముకుని గోడుగోడున ఏడ్చిన దృశ్యాన్ని ఎలా మరువను?

'కన్నా నా చిట్టి తండ్రీ... నువ్వు డాక్టరువి అవాలిరా. ఇలా మనుషులు చచ్చిపోకుండా కష్టాలలో వున్నవారిని ఆదుకోవాలిరా!' ఆ మాటలని ఎప్పటికీ మరువను.

నేను డాక్టరు నవ్వాలి అన్న ధృఢ నిశ్చయం నాగుండెల్లో చోటు చేసుకుంది. అందుకే నిద్రపట్టడం లేదు.

...ఈ రోజే ఇంటర్‌లో చేరాను.

బై.పి.సి తీసుకున్నాను. కాలేజీ చదువులో కలిగే ఉత్సాహం నాలోనూ కలిగింది. నా స్నేహితులు సినిమాలంటూ షికార్లంటూ అచ్చం కాలేజీస్టూడెంట్లులాగా తిరుగుతున్నారు. నేనూ అలా తిరగగలనా! నా పిచ్చిగానీ ఆర్థికంగా వారితో సమంగా తూగగలనా! అయినా నా ధ్యేయం దెబ్బతినదూ! నన్ను నేను కంట్రోలు చేసుకోవడం చాలా అవసరం...

... మనిషి పడే శ్రమ ఎన్నడూ వృధా పోదేమో! నేను పడిన కష్టానికి ఇంటర్‌లో ఫస్ట్ క్లాస్ తెచ్చుకున్నాను. నేను ప్యాసయిన సంతోషం కంటే పక్కింట్లో జరిగిన తతంగం నన్ను కలవరపరిచింది. పవన్ ఫెయిలయ్యాడు. బాగా దెబ్బలు తిన్నాడు. అంత పెద్దవాడిని కొట్టడానికి చేతులెలా వస్తాయోవారికి, మాకు పరమాన్నం తినిపిస్తున్న అమ్మ గబగబా వెళ్ళి పవన్‌ని లాక్కొచ్చింది.

అయినా ఇప్పుడు కాకపోతే ఇంకోనాడు పాసవుతాడు.



## భార్యా బాధితుడు

నా భార్యతో పెద్ద బాధయిపోయిందోయ్! పెళ్ళయిన దగ్గర్నుంచీ ప్రతి గంటకోసారి వంద రూపాయలివ్వండీ.. యాభై ఇవ్వండి అంటూ చంపేస్తుంది'' అన్నాడు రేవరంత్.

''అంత డబ్బు ఏం చేస్తోంది?'' అడిగాడు నిశాంత్.

''ఏమో నేనెప్పుడూ ఇచ్చి చూడలేదు'' నింపాదిగా అన్నాడు రేవంత్.

—జోకర్ (హైదరాబాద్)

ఎందుకు వాళ్లకంత పట్టుదల!...

...ఇంటర్ రిజల్ట్స్‌కి ఓ పది మార్కులు ఎక్కువ కలిపారు. పవన్ అదృష్టం ప్యాస్ అయిపోయాడు. ఇద్దరమూ మెడికల్ ఎంట్రన్స్‌కి ప్రిపేరవుతున్నాం. పవన్‌కి మాత్రం వాళ్ల నాన్న ఎన్నో కట్టుదిట్టాలు పెట్టాడు. వూపిరి కూడా తీసుకునే వీలులేకుండా ట్యూషన్లు పెట్టిచ్చాడాయన. నాకు మాత్రం అప్పుడప్పుడు సీటు వస్తుందా అన్న చింత పట్టుకుంటోంది.

అమ్మో! సీటు రాకపోతే ఎలాగ!

అనుకున్నది సాధించాలి...

... ఈ రోజు మెడికల్ ఎంట్రెన్స్ రాశాను. చాలా బాగా రాశాను. ఏ ఒక్క ప్రశ్నకీ జవాబివ్వలేనేమో నని భయపడ్డ నేను చాలామటుకు సరియైన జవాబులే ఇచ్చి వచ్చాను.

మనసు దూది పింజంలా ఎగురుతోంది.

సీటు రావడం ఖాయం.

అయితే నేను డాక్టరునవుతాను.

నాకు నిద్ర పట్టడం లేదు.

ఓ డాక్టరుగా నన్ను నేను ఊహించుకుంటోంటే బలేగా ఉంది.


ప్రక్కనే తమ్ముడూ చెల్లాయి చాలీచాలని బొంతని తమ వైపుకి లాక్కుంటూ కప్పుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ చిరుగుల బొంతలతో ఇక పనుండదు. ఇంత దీనావస్థలో ఉండనక్కరలేదు. అమ్మ చీర కొనుక్కుని ఎన్ని ఏళ్ళయింది! పాతవే వాడుతుంది పాపం.

నాన్నమాత్రం ఉన్న రెండు మూడు జతలతోనే వెళ్ళబుచ్చటం లేదూ! సంపాదిస్తున్నా డబ్బుని పిల్లలకి సదుపాయాల్ని కూర్చడానికే ఖర్చుపెట్టేస్తారు.

అమ్మమ్మలాగా మరణాన్ని పొందకుండా ఏ కొద్దిమందికయినా తను డాక్టరుగా సహాయం అందివ్వ గలిగితే...

చేద్దాం



"...బాబూ శ్యామూ నీ ఎంట్రన్స్ రిజల్ట్సు వచ్చిందిరా" అన్న నాన్న పిలుపుకి ఉలిక్కిపడ్డాను.

మంచి మార్కులు తెచ్చుకున్న నాలో కలిగిన ఉద్వేగాన్ని ఎలా చెప్పను!

కానీ ఆశ్చర్యం నాకంటే మంచి మార్కులు తెచ్చుకున్నవారు కూడా వున్నారు నా ముందు.

బావుంది. నాకంటే తెలివైనవారు ఉండరా! ఉండకూడదా!

నవ్వు వస్తోంది నాకు.

మరి నా వెనకగా ఉన్న కొన్ని వేల మంది సంగతేమిటి? నేనే ఇలా ఫీలవుతే, వారేమవాలి?

నాకు సీటు తప్పకుండా వస్తుందని అందరి అభిప్రాయం.

కానీ నాన్నగారెందుకో అంత ఉత్సాహంగా ఉన్నట్లు కనిపించలేదు.

కారణం తెలియదు...

...ఫైనల్ లిస్టు వచ్చిందిరోజు. ఎంత విషాదకరమైన రోజు నాకిది. లిస్టులో నా పేరు లేదు.

దిగులుగా ఉంది.

ఏడుపు వస్తోంది.

ఎవరితో మాట్లాడాలన్నా గొంతు పూడుకుపోయింది. అందరి ముందు ఏడ్చేస్తానేమో ననుకున్నాను.

పవన్‌కి సీటు వచ్చింది.

అదేమిటి? నాకు వచ్చిన మార్కుల్లో సగం కూడా రాలేదే వాడికి.

నాకు బుర్ర తిరిగిపోయింది.

ఇంటికి ఎలా వచ్చిపడ్డానో నాకే తెలియదు.

ఇది నా ఇల్లు.

నేనిక్కడ వంటిపిల్లాడినే.

అప్పటికే సంగతి తెలుసుకున్న నాన్నగారు ఉదాసీనంగా కూర్చున్నారు.

అంతే ఎలా ఏడ్చేశానో!

అమ్మకూడా నన్నాపలేకపోయింది.

గట్టిగా అరిచాను.

గోడల్ని పిడికెళ్ళలో బాదాను.

ఆవేశాన్ని బయటకి వెళ్లగక్కాను.

తల బాదుకున్నాను.

నన్నాపడానికి ప్రయత్నించలేదు నాన్నగారు. బహుశా ఇలా జరుగుతుందని ఆయనకి ముందే తెలుసుననుకుంటా.

నేను తేరుకున్నాక నన్ను పక్కన కూర్చోబెట్టుకున్నారు.

ఇలా ఎందుకు జరిగిందో తెలుసా! రిజర్వేషన్లు ఉండటం మూలాన. వెనుకబడిన వారికి, షెడ్యూల్డ్ కులాల వారికీ, ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకీ, అంగ వైకల్యం కలవారికీ, ఆటు తర్వాత నాన్-లోకల్ వారికీ సీట్లు పోగా మిగిలినవాటిలో మిగిలిన పోటీలో నువ్వు నెగ్గలేకపోయావు. అంతే నీ తప్పేం లేదమ్మా: నువ్వు బాగానే చదివావు.

ఆహా ఎంత అందంగా సర్దిపుచ్చారు.

ఆయన ప్రమోషన్‌కి ఈ రిజర్వేషన్లే అడ్డువచ్చాయి. ఆయనలాగే నన్నూ దొరికిన వాటితో సర్దిపుచ్చుకుని ఎక్కడికక్కడ జీవితంతో రాజీపడడం నేర్పిస్తున్నారన్నమాట.

ఇదేనా జీవితం!,

అయినా జీవితాన్ని జనరలైజ్ చేసి తిట్టడం ఎందుకు?

కొంతమందికి అవసరం లేకపోయినా విలువ తెలియక పోయినా వెండి పళ్ళాలలో పంచభక్ష్య పరమాన్నాలు ప్రసన్నమవుతుంటే, వారి జీవితాలు బాగున్నట్లేగా. కనీసం విస్తరాకులో తిందామని ఆశపడ్డా దక్కని భోజనం గురించి ఆలోచించే నేను, తిట్టుకోవాలి కానీ జీవితాన్ని!

నేని విషయాన్ని అంత సులువుగా మరచిపోగలనా! జీవితాన్ని తిట్టకుండా బతకగలనా!...

...నాలో నిరసం. ఆలోచించి ఆలోచించి మెదడు కూడా బలహీనమైంది. నాకేదో పెద్ద జబ్బుచేసి లేచినట్లుగా ఉంది. పోనీ అనుకున్నది సాధించలేకపోయినా మామూలుగా బతికేద్దాం అనుకుంటున్న తరుణంలో స్వీటు ప్యాకెట్టుతో సహా వచ్చాడు పవన్, మెడిసన్‌లో సీటు వచ్చిందంటూ.

మేమెవ్వరమూ కూడా మాట్లాడలేకపోయాము సరిగ్గా.

నాన్నగారే 'సంతోషం బాబూ' అంటూ స్వీట్సు అందుకున్నారు.

'ఆంటీ... ఇదుగో ఈ గోల్డు చైను కొనిచ్చింది మా అమ్మ నాకు మెడిసన్‌లో సీటు వచ్చినందుకు' నాలుగుంగరాలున్న చేత్తో ఎత్తిపట్టి మెడలోని గొలుసుని చూపించాడు.

అనుకోకుండా నా కళ్ళు' అమ్మ మెడలోవున్న పసుపుతాడు మీదపడ్డాయి.

పవన్ అసలు ఏ విధంగా వెనుకబడ్డవాడు? పవన్ మీద ఈర్ష్యగా ఉంది నాకు.

అవును మరి వాడూ మనిషే, నేనూ మనిషినే. ఇద్దరమూ వూపిరి పీల్చి బతుకుతున్నాము. మాకున్న తేడా అల్లా వాడికి చదువంటే నిర్లక్ష్యం. నాకు శ్రద్ధ.

అయినా వాడికి డాక్టరయే అర్హత వుంది. నాకు లేదు.

ఎందుకిలా అవుతోందసలు!

అయినా పవన్ తప్పేముంది.

అగ్రకులంలో పుట్టిన నాది తప్పుకానీ.

...పరిస్థితులని అర్థం చేసుకుంటున్న నేను అందులోని ఎన్నో వాస్తవాలను జీర్ణం చేసుకోలేకపోతున్నాను. నాన్న బి.ఎస్.సిలో చేరిపొమ్మన్నారు. గుండెని రాయి చేసుకునుంటారు. నమ్మకం లేని ఆశల వెనుక పరుగులెత్తడ మెందుకనుకున్నారేమో!

కేవలం రెండు మార్కుల తేడాతో సీటుని పోగొట్టుకున్న నేను, ఈసారి మళ్లీ రాద్దామంటే రిజర్వేషన్లు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదే!

దొంగ సర్టిఫికేట్లు పెట్టుకుని కూడా చాలామంది సీట్లు సంపాదిస్తున్నారని విన్నాను.

నాకంతా అయోమయంగా ఉంది.

బతకడం చాతకాదు మాకు.

సమర్థులని అసమర్థులుగానూ, అసమర్థులని సమర్థులుగానూ చేసి అర్హతలని తారుమారు చేసేసే ఈ వ్యవస్థని మార్చేదెవరు?

నా పిచ్చిగానీ, స్వార్థపరుల చేతుల్లోని వ్యవస్థ ఏనాటికైనా ఎలా మారుతుంది.

నిజానికి బడుగువర్గాల వారిదా తప్పు!

మరి ఎవరిది?

రాజనీతిది.



### యాక్సిడెంట్

సైకిల్ యాక్సిడెంట్ అయి ఆసుపత్రిలో చేర్చబడ్డ వ్యక్తితో డాక్టర్ "మీ పేరు చెప్పండి. మీ కుటుంబ సభ్యులకు తెలియజేస్తాం" అన్నాడు.

అందుకావ్యక్తి "మా కుటుంబ సభ్యులకు నా పేరు తెలుసులెండి" అంటూ బదులిచ్చాడు.

—జోకర్ (హైదరాబాద్)

ఓట్లకోసం కొన్ని వర్గాలని అణచి, ఇంకొన్ని వర్గాలని తృప్తిపరచే తుగ్గకుల్లాంటి లీడర్లది తప్పు.

వారి నీతి ప్రకారం ఓట్లకోసం ఏమైనా చేస్తారు.

అగ్రవర్ణాలవారి ఆక్రందనలు బడుగువర్గాల వారి ప్రగతికి సోపానాలే అవుతున్నాయి.

నాది తప్పు!

నాలా అగ్రకులాలలో పుట్టినవారిది తప్పు.

అన్నీ చూస్తుంటే నాలో అంతులేని ఆవేశం... ఆ ఆవేశం స్థానే నిస్సత్తువ.

అందరూ మామూలుగా బతికేస్తున్నారు. నేనెందుకు బతకలేకపోతున్నాను!

అందరినీ కొట్టేయాలనిపిస్తుంది ఒక్కోసారి.

ఇంట్లో ఎవ్వరికీ వినిపించకుండా దుప్పటి కప్పేసుకుని రాత్రిళ్ళు కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాను.

అసలెందుకీ పుట్టుక అనిపిస్తోంది.

నేనేం చేస్తానో నాకే తెలియదు....

అంతవరకు ఉగ్గబట్టుకుని చదివిన డా. రఘురాం తల భారంగా అనిపించింది. మనసంతా కలత చెందింది.

ఆయన కూడా ఈ విషయం గురించి చాలా ఉధృతంగా ఆలోచించసాగారు

అలా ఆలోచిస్తూనే తెల్లవారే సమయానికి నిద్రలోకి జారిపోయారాయన...

"ఏవండీ... ఏవండీ..." భార్య కుదుపుతోంటే ఉలిక్కిపడి నిద్రలోంచి లేచారాయన.

"ఏదో అర్జంటు ఫోను హాస్పిటల్ నించి."

నిద్రమత్తులోనే రిసీవరు అందుకున్నాడు రఘురాం.

ఫోనులో అందుకున్న వార్త వినగానే మత్తు కాస్తా వదిలిపోయింది.

శ్యామ్‌సుందర్ ఆత్మహత్య చేసుకున్నాడు.

ఒక్క నిముషం చలనం లేకుండా అయిపోయాడు.

"నో- అలా వీల్లేదు. నేనింకా అతనిని బాగుచేయాలి. చికిత్స చేయాలి".

కొద్ది నిమిషాల క్రితం వరకూ నలిగిన మనసుతో బాధపడుతూ తన ఎదురుగా, సజీవంగా నిలబడ్డ శ్యామ్‌సుందర్ ఇకలేడు.

ఆ ఆలోచననే భరించలేకుండా ఉన్నాడు.

ఇది ఆత్మహత్యా!

కాదు అని అరవాలనిపించింది డా. రఘురాంకి. *